క్లుప్తంగా

గంగమ్మా.. చల్లంగ చూడమ్మా..

సిద్దవటం : మండల పరిధి మాధవరం–1 గ్రామ పంచాయతీలోని పార్వతీపురం గ్రామంలో వెలసిన శ్రీ శీతల గంగమ్మకు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం, అలంకరణ, కుంకుమార్చన, బోనాల సమర్పణ, తీర్థప్రసాదాల స్వీకరణ వంటి కార్యక్రమాలు చేపట్టారు. 'అమ్మా తల్లీ.. చల్లంగ చూడమ్మా' అని భక్తులు వేడుకున్నారు. అనంతరం అలయ పూజారి రంగమ్మ మాట్లాడుతూ చైత్ర మాసంలో ప్రతి మూడవ గురువారం శీతల గంగమ్మకు పెద్ద ఎత్తున బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోందన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాలు

నందలూరు : మండలంలోని నందలూరు గ్రామ పంచాయతీలో వెలసిన నడివీధి గంగమ్మకు గురువారం మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. తెల్లవారుజామున నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. నిర్వాహకులు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

సీహెచ్‌ఓలను క్రమబద్ధీకరించాలి

లక్కిరెడ్డిపల్లి : వైద్య, ఆరోగ్యశాఖలో సీహెచ్‌ఓలుగా పనిచేస్తున్న వారిని క్రమ బద్ధీకరించాలని గురువారం కేంద్రాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శివకుమార్ మాట్లాడుతూ గత 2 సంవత్సరాలుగా జీత భత్యాల విషయంలో ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నామని తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిరసన చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శివకుమార్, భరత్ కుమార్ దీప్తి, శివరంజనీ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బంది ఆందోళన

రాజంపేట : రాజంపేట ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది గురువారం నిరసన ప్రదర్శన చేపట్టారు. నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో డిపో గేట్ వద్ద మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో అధ్యక్షుడు శివయ్య, డిపో సెక్రటరీ రమణయ్య, గ్యారేజి అధ్యక్షుడు గోపాల్, డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ జీవీ రమణ మాట్లాడుతూ వన్ బార్ 19 సర్కులర్ ఇంప్లిమెంట్ చేయాలన్నారు. చైల్డ్ కేర్ లీవ్స్‌ను మహిళలకు మంజూరు చేయాలన్నారు. ఆర్టీసీలో పాత వైద్య విధానం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో గ్యారేజి కార్మికులు, కండక్టర్లు, డ్రైవర్లు, ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల నిరసన

రాజంపేట : రాజంపేట మున్సిపల్ కార్యాలయం వద్ద గురువారం మున్సిపల్ కార్మికులు మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సి.రవికుమార్ మాట్లాడుతూ 62 ఏళ్ల తర్వాత పదవీ విరమణ కల్పించాలన్నారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పీవీ రమణ మాట్లాడుతూ కార్మికులు ఐక్యంగా ఉద్యమించకపోతే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం కార్మికుల పట్ల చూపుతున్న వైఖరిని వీడకపోతే.. రాబోయే రోజుల్లో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో కార్మిక నేతలు లక్ష్మీదేవి, ప్రసాదు, ప్రమీలమ్మ, రమణమ్మ, రెడ్డయ్య, కోటయ్య, జి.రమణ, కోదండమ్, సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

నివాళి



శశికుమార్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : ఇటీవల మృతి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బత్తిన శశికుమార్‌రెడ్డి దశ దినకర్మలకు గురువారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా శశికుమార్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అలాగే శశికుమార్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్ కుటుంబం వెంట నడుస్తూ పార్టీకి ఎంతో సేవ చేశారని తెలిపారు. శశికుమార్‌రెడ్డి లేని లోటు తీరనిదన్నారు. ఈ కార్యక్రమంలో పుల్లంపేట ఎంపీపీ ముద్దాబాబుల్‌రెడ్డి, చొప్పాయల్లారెడ్డి, తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి, సీహెచ్ రమేష్, మందల నాగేంద్ర తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరామర్శ


నందలూరు : నాగిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ కుమ్మరపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు మధురాజు తండ్రి వెంకట నరసరాజు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో ఆయన ఇంటికి రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి వెళ్లి పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట గడికోట వెంకట సుబ్బారెడ్డి, గుండు మల్లికార్జునరెడ్డి, ఇబ్బుబాయ్, ఆనాల మధు యాదవ్, నవాబ్, మా బాష, విజేయుడు, అశోక్‌రెడ్డి, మహేష్‌రెడ్డి ఉన్నారు.

నాగిరెడ్డిపల్లిలో..

నందలూరు మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు శివరామయ్య తండ్రి రైల్వే రిటైర్డ్ ఉద్యోగి పాంబల సుబ్రమణ్యం గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి వెళ్లి సుబ్రమణ్యం మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన వెంట శైల కుమార్, నాగ సుబ్బయ్య తదితరులు ఉన్నారు.

క్రీస్తు సందేశం.. శాంతి మార్గం

- నేడు గుడ్‌ఫ్రైడే
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు



రాజంపేట టౌన్ : క్రీస్తు అనగానే క్షమ, కరుణ గుణాలు గుర్తుకు వస్తాయి. లోకంలోని పాపులను పరిశుద్ధులు చేసేందుకు, వారికి క్షమను అందించేందుకు కరుణామయుడైన ఏసుక్రీస్తు.. శిలువపై తన ప్రాణాలను బలిపెట్టిన రోజే గుడ్‌ఫ్రైడే. దీనినే శుభ శుక్రవారం అని కూడా అంటారు. తన ఆత్మబలిదానంతో పాపులకు దేవుని పరిశుద్ధ సన్నిధిలో స్థానం కల్పించిన ఈ శుక్రవారాన్ని ప్రపంచంలోని క్రైస్తవులందరూ శుభ శుక్రవారంగా భావిస్తారు. దయామయుడైన క్రీస్తు శిలువపై చిందించిన రక్తం మానవాళికి శుభాలను చేకూర్చింది. అందువల్ల క్రైస్తవులు, విశ్వాసులు గుడ్‌ఫ్రైడేని భక్తిశ్రద్ధలతో నిర్వహించుకుంటారు. గుడ్‌ఫ్రైడే నాడే కల్వగిరిపై క్రీస్తును శిలువపై శిక్షించారు.

ఘనంగా ఏర్పాట్లు

జిల్లాలో గుడ్‌ఫ్రైడే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించుకునేందుకు క్రైస్తవులు, విశ్వాసులు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. అందులో భాగంగా పాస్టర్లు చర్చిల్లో ఉపవాస ప్రార్థనలు చేయనున్నారు. ఏసు ప్రభువు చూపిన మార్గాన్ని అనుసరించి ఆరాధించే వారికి పరలోక ద్వారాలు తెరుచుకొని ఉంటాయని విశ్వాసుల ప్రగాఢ నమ్మకం. ఏసు మరణం సృష్టిలో ఓ అద్భుతమైన త్యాగపూరిత మరణం. దేవునితో మానవునికి శాశ్వత బంధాన్ని ఏర్పరిచిన గొప్ప మరణం.

రేపటితో ముగియనున్న లెంట్‌డేస్

గుడ్‌ఫ్రైడేని పురస్కరించుకొని క్రైస్తవులు, విశ్వాసులు 40 రోజుల పాటు లెంట్‌డేస్ (శోక దినాలు) నిర్వహిస్తారు. ఈ ఏడాది మార్చి 5వ తేదీ నుంచి ప్రారంభమైన లెంట్‌డేస్ శనివారంతో ముగియనున్నాయి. లెంట్‌డేస్ సందర్భంగా క్రైస్తవులు నలభై రోజులు శుభకార్యాలకు దూరంగా ఉంటారు. నిరంతరం దైవధ్యానంలోనే గడుపుతారు. పొరపాటున కూడా చెడు వ్యాపకాలవైపు మనసు మరల్చకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. లెంట్‌డేస్ సందర్భంగా చర్చిల్లో ఉదయం, సాయంత్రం ప్రత్యేకంగా మౌనంగా ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. కాగా శుక్రవారం గుడ్‌ఫ్రైడేని, ఆదివారం ఈస్టర్ వేడుకలను క్రైస్తవులు, విశ్వాసులు ఘనంగా నిర్వహించుకోనున్నారు.

పునరుత్థానమే ఈస్టర్

కల్వరి కొండమీద శిలువపై మరణించిన క్రీస్తును.. అక్కడి కొండ గుహలో సమాధి చేస్తారు. మూడవ రోజు ఏసుక్రీస్తు పునరుత్థానం పొంది తిరిగి తన శిష్యులకు దర్శనమిచ్చారు. 'నేను జీవమును' అన్న మాటకు నిదర్శనంగా నిలిచి లోకానికి తన దివ్య మహిమను చాటారు. ప్రభువు పునరుత్థానం చెందిన ఆదివారాన్ని ఈస్టర్ సండేగా పిలుచుకుంటారు. అశాంతితో తల్లడిల్లుతున్న నేటి ప్రపంచానికి క్రీస్తు ప్రబోధించిన ప్రేమ, దయ, కరుణ, క్షమ గుణాలు ఆదర్శం కావాలని పాస్టర్లు చెబుతున్నారు. కాగా జిల్లాలో పలు చర్చిల్లో క్రీస్తు ఆత్మబలిదానం, శిలువ యాగం తదితర ఘట్టాలను ప్రదర్శించనున్నారు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఏసు ప్రభువు కల్వరి కొండపై బలిదానం చేసిన ఘట్టాలను క్రైస్తవులు, విశ్వాసులకు పాస్టర్లు తెలియచేయనున్నారు.

మహోన్నతమైన రోజు



మానవుల పాప నివారణ కోసం ఏసుక్రీస్తు శిలువపై మరణించిన రోజే గుడ్‌ఫ్రైడే. గుడ్‌ఫ్రైడే మానవులందరికీ మహోన్నతమైన రోజు. ఏసుక్రీస్తుపై విశ్వాసం ఉంచిన వారు పాపముల నుంచి విముక్తి పొంది నిత్యజీవం పొందెదరు.

- మార్టిన్ లూథరన్, పాస్టర్, బేతేలు చర్చి, తుమ్మల అగ్రహారం, రాజంపేట

జనసేన అధికారం చేపట్టినా ఒరిగింది శూన్యం

- నాయకులు, కార్యకర్తలకు పదవుల్లో అన్యాయం
- జనసేన సీనియర్ నాయకుడు రామసుబ్బయ్య



మాట్లాడుతున్న జనసేన సీనియర్ నాయకుడు రామసుబ్బయ్య

రైల్వేకోడూరు అర్బన్ : జనసేన పార్టీ కూటమితో కలిపి అధికారం చేపట్టి ఏడాది అయినప్పటికీ.. కార్యకర్తలకు, నాయకులకు న్యాయం జరిగింది శూన్యమని, కొందరు నాయకులు పార్టీని భ్రష్టు పట్టిస్తున్నారని జనసేన సీనియర్ నాయకుడు ముద్దబోలు రామసుబ్బయ్య, వరికూటి నాగరాజు, వీరేంద్ర రాయల్ పేర్కొన్నారు. స్థానికంగా వారు గురువారం విలేకరులతో మాట్లాడారు. ఎన్డీఏ కూటమి జనసేన పార్టీ అభ్యర్థిగా అరవ శ్రీధర్ గెలుపొంది ప్రభుత్వ విప్‌గా పదవి పొందడం చాలా సంతోషకరమని, నామినేటెడ్ పోస్టులు కొందరు నాయకులు కుట్రపూరితంగా ఒకే కుటుంబానికే పరిమితమయ్యే విధంగా విధి విధానాలు సృష్టించి పొదవులు పొందడం ఎంతవరకు భావ్యమన్నారు. మార్కెట్ చైర్మన్ విషయంలో ఇద్దరు, ముగ్గురు నాయకులే కుట్రపన్ని వారి కుటుంబాలకే వచ్చే విధంగా చేసుకోవడం దారుణమన్నారు. జనసేన ఎమ్మెల్యే ఉన్నా కూడా నామినేటెడ్ పదవులు జనసేన వారికే ఇవ్వాలని అధిష్టానం నిర్ణయించినా.. నామ మాత్రంగా సమావేశాలు ఏర్పాటు చేసి టీడీపీ ఇన్‌చార్జ్ రూపానందరెడ్డిని పిలిచి నామమాత్రంగా సమావేశం ఏర్పాటు చేసి కార్యకర్తల అభిప్రాయం లేకుండానే వారికి నచ్చిన వారికి ఇవ్వడం సబబు కాదన్నారు. సమావేశాలను మసిపూసి మారేడుకాయ చేసి వారికి నచ్చిన వారికే ఇచ్చుకుంటున్నారని పేర్కొన్నారు. అన్నికులాలు, అన్ని వర్గాలను దగ్గరకు తీసుకోవాలని, అలా కాకుండా కేవలం కొంత మంది వర్గాల వారినే కుర్చీలో కూర్చోపెట్టి కాలం గడుపుతున్నారని విమర్శించారు. జనసేన పార్టీని నాశనం చేయాలని చూస్తున్నారన్నారు. కొందరు స్వలాభం కోసం పార్టీ విధి విధానాలను తాకట్టు పెడుతున్నారని పేర్కొన్నారు. అధినేత పవన్ కల్యాణ్ ఆశయాలకు అనుగుణంగా నడిపే సామర్థ్యం లేకపోతే తప్పుకోవాలని సూచించారు. 14 సంవత్సరాల జనసేన పార్టీ ప్రస్థానంలో ఈ రోజు వరకు ఎంత మంది ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ సామాజిక వర్గీయులు పార్టీలో చేరారని విమర్శించారు. స్థానిక నాయకత్వం బాగ లేదని పేర్కొన్నారు. రాబోయే లోకల్ బాడీ ఎన్నికల్లో మీ స్వలాభం కోసం ప్రయత్నిస్తే భారీ మూల్యం చెల్లించుకుంటారని వారు అన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి

రాజంపేట రూరల్ : విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని ఆకేపాటి ఎస్టేట్‌లో గల ఆకేపాటి అమరనాథరెడ్డి ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో గురువారం కరస్పాండెంట్ ఆకేపాటి అమరనాథరెడ్డి ఆధ్వర్యంలో 3వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్యే ఆకేపాటి, అమర జ్యోతమ్మ దంపతులకు విద్యార్థులు పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ వేడుకలలో ప్రిన్సిపల్ శ్యామల గౌరీ, ఉపాధ్యాయులు జబ్బిరెడ్డి వేంకటరెడ్డి, పలుకూరి దయానంద్, మహేశ్వరరెడ్డి, జ్యోష్ణ, స్వర్ణకుమారి, హేమలత, అనురాధ, మాధవి, చంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అంకితభావం అవసరం



ఏవో కృష్ణుడును సన్మానిస్తున్న జిల్లా పోలీస్ శాఖ అధికారులు

రాయచోటి టౌన్ : విధి నిర్వహణలో అంకిత భావం, నిబద్ధత, సమర్థత ప్రతి ఉద్యోగికి అవసరం అని ఎస్పీ విద్యాసాగర్ నాయుడు అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏఏవోగా విధులు నిర్వర్తిస్తూ పదోన్నతిపై గుంతకల్లు రైల్వే ఏవోగా వెళ్తున్న బి.కృష్ణుడిను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నూతన జిల్లా ఏర్పడినప్పటి నుంచి ఏఏవోగా విధులు నిర్వర్తిస్తూ మన్ననలు పొందారని తెలిపారు. ఎంతో అంకితభావం, నిబద్ధతతో విధులు నిర్వర్తించడం వలనే గుర్తింపుతోపాటు పదోన్నతి లభించిందన్నారు.

ఏఏవోగా త్రినాథ్

ఏఏవోగా త్రినాథ్ సత్యం బాధ్యతలు చేపట్టారు. ఆయన మన్యం జిల్లా పార్వతీపురం నుంచి బదిలీపై అన్నమయ్య జిల్లాలోని రాయచోటి జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఏఏవో ఉద్యోగం ఎన్నో సవాళ్లతో కూడినదన్నారు. ప్రస్తుతం ఎన్నో సవాళ్లు మన ముందున్నాయని, వాటిని నిబద్ధత, దృఢనిశ్చయంతో అధిగమిస్తారనే నమ్మకం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ యం.వెంకటాద్రి, డీసీఆర్‌బీ సీఐ యం.తులసీరాం, ఆర్‌ఐలు వీజే రామకృష్ణ, యం.పెద్దయ్య, సీసీ ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల పరిరక్షణకు చర్యలు తీసుకోండి

రాయచోటి అర్బన్ : పట్టణంలోని జాతీయ రహదారి, బస్టాండు మార్గాలలో ఉన్న పలువురు జాతీయ నేతలు, ప్రముఖుల విగ్రహాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని పలుసంఘాల నేతలు మున్సిపల్ కమిషనర్ వాసుబాబుకు విన్నవించారు. ఈ మేరకు గురువారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు వినతి పత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ విపరీతమైన వాహనాల రాకపోకల కారణంగా విగ్రహాలపై దుమ్ము,ధూళి పేరుకుపోవడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షురాలు పద్మ, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరమణ, శరత్‌కుమార్, యోగానందబాబు, జయరాం, వలీబాషాతోపాటు పలువురు పాల్గొన్నారు.

మేనేజ్‌మెంట్ విద్య పాత్ర కీలకం

మేనేజ్‌మెంట్ విద్య అనేది ఉద్యోగసాధన మార్గం మాత్రమే కాకుండా, సమాజ నిర్మాణానికి ఒక శక్తివంతమైన సాధనంగా గుర్తించాలని శ్రీసాయి ఇంజినీరింగ్ కళాశాల ఏడీ సుధాకరరెడ్డి అన్నారు. గురువారం కళాశాలలో మేనేజ్‌మెంట్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వి.బాలాజీ, మేనేజ్‌మెంట్ విభాగాధిపతి ఇంతియాజ్ తోపాటు వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పండు ఈగ నివారణపై అవగాహన



మామిడి తోట పరిశీలనలో వ్యవసాయ విశ్వవిద్యాలయ విద్యార్థులు

సిద్దవటం : మండలంలోని వంతాటిపల్లె గ్రామంలో గ్రామీణ అవగాహన (ఆర్‌ఏడబ్ల్యూఈపీ) కార్యక్రమంలో భాగంగా గురువారం మామిడి చెట్లను తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మామిడిలో పండు ఈగ నివారణ చర్యలపై రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు ప్రవీణ్ పాలు, అశోక్, అరుణ్, వివేక్, వీసీఏ ప్రేమ్, రైతులు పాల్గొన్నారు.

నగరవనం సందర్శించిన విద్యార్థులు

రాజంపేట టౌన్ : రాజంపేట, పుల్లంపేట మండలాలకు చెందిన వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు గురువారం రాజంపేట–రాయచోటి మార్గంలో ఉన్న నేచర్ క్యాంప్‌నకు వెళ్లారు. జాతీయ హరితదళం రీజనల్ కో–ఆర్డినేటర్ జి.చక్రధర్‌రాజు ఆధ్వర్యంలో విద్యార్థులు నగరవనంలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ రేంజర్ దత్తాత్రేయ, పుల్లంపేట ఎంఈఓ–2 నాగతిరుమలరావు, రాజంపేట, పుల్లంపేట మండలాలకు చెందిన వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు సుబ్బరాజు, జితేంద్ర, ధర్మేంద్ర, ఖాదర్‌బాషా, శివ, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నాయక్, బీట్ ఆఫీసర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పిస్తున్న సంస్థ ప్రతినిధులు

సుండుపల్లె : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రాయలసీమ దళిత గిరిజన వెనుకబడిన తరగతులు, మైనార్టీ సంస్థ ఆధ్వర్యంలో ఆర్బీఐ వారి సహకారంతో డిపాజిటెడ్ ఎడ్యుకేషన్ అవేర్‌నెస్ ఫండ్ అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి బీవీ రత్నం మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల ఆశా కార్యకర్తలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చాలా మంది అవగాహన లేక బ్యాంకు ఖాతాలను లావాదేవీలు జరగకుండా నిలిపివేయడం, ఖాతాలకు నామినీలను జత చేయకపోవడం, మొబైల్ లింక్, ఆధార్ లింక్, పాన్‌కార్డు లింకు చేయకపోవడం వల్లఈ సమస్య అంతా కూడా డీఏఐ కింద ఆర్బీఐకి చేరుతుందన్నారు. అందువల్ల మన అకౌంట్‌కి నామినీ పేరును అప్‌లోడ్ చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళా జాతర బృందం వారిచే ఆర్థిక లావాదేవీలు, ప్రభుత్వ బీమా పథకాలు, సైబర్ నేరాల గురించి క్లుప్తంగా పాటల రూపంలో, మ్యాజిక్ ద్వారా ఆశా కార్యకర్తలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ దళిత గిరిజన వెనుకబడిన తరగతులు మైనార్టీ సంస్థ నుంచి రాచరాయుడు, వెంకటయ్య, చంద్ర, నాయకులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరులో 1న జాతర

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరులో ఏటా వైభవంగా నిర్వహించే గంగమ్మ జాతరను మే 1న నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ నిర్ణయించింది. దీంతో గురువారం జాతరలో భాగంగా ఘటంకుండ, దున్నపోతుకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. దున్నపోతుకు సంప్రదాయబద్ధంగా పూజలు చేసి ఊరంతా తిప్పారు. ప్రతి ఏడాది సంప్రదాయంగా కోడూరు జాతరలో ఘటంకుండ, దున్నపోతుకు ప్రత్యేక స్థానం ఉంది. జాతర చాటింపు జరిగిన నాటి నుంచి ఘటంకుండతో భక్తులు దున్నపోతును అలంకరించి కోడూరు పొలిమేర లోపల ఉన్న ప్రతి వీధికి, ప్రతి ఇంటికి తిరుగుతారు. జాతర ఘట్టం ప్రారంభం అయ్యేలోగా అన్ని వీధులు తిరిగి వచ్చేస్తారు.

పటిష్ట బందోబస్తు

వీరబల్లి : మండలంలోని సానిపాయిలో ఈ నెల 20, 21, 22వ తేదీలలో జరిగే గంగమ్మ జాతరకు గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ మోహన్ నాయక్ తెలిపారు. స్థానికంగా ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

సిద్దవటం : మాధవరం–1 గ్రామ పంచాయతీ శివారులోని బంగారుపేట గ్రామ సమీపంలో వెలసిన శ్రీ గంగాభవానీ 33వ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి జరుగునని ఆలయ ఫ్యామిలీ ట్రస్టు అధ్యక్షుడు మాడా పెద్దసుబ్బరాయుడు, రామక్రిష్ణయ్య తెలిపారు. శుక్రవారం అమ్మవారికి గణపతి పూజ, స్వస్తి వాచనం, మాతృకపూజ, రక్షాబంధనం, అష్టోత్తర కలశాభిషేకం అర్చనలు, మంగళహారతి వంటి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు గంగా భవానీకి ప్రీతికరమైన లక్ష కుంకుమార్చన పూజలు, పూజలో పాల్గొన్న స్త్రీలందరికీ అమ్మవారి ప్రసాదాలు, మంగళ ప్రదమైన గాజులు, పసుపు, కుంకుమలు అందజేస్తారన్నారు. శనివారం ఉదయం చండీ హోమం, మహాపూర్ణాహుతి, మంత్రపుష్పం, మహదాశీర్వచనం, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవం జరుగునని వివరించారు. ఆదివారం అమ్మవారికి బోనాలు, మొక్కుబడుల చెల్లింపు కార్యక్రమాలు ఉంటాయని అన్నారు. కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

హెల్మెట్ ధారణ.. ప్రాణ రక్షణ

రాజంపేట : వాహనదారులు హెల్మెట్ ధరిస్తే.. ప్రాణాలు రక్షించుకోవచ్చని మన్నూరు సీఐ కుళాయప్ప తెలిపారు. ఇంజినీరింగ్ కళాశాలల నిలయమైన న్యూబోయనపల్లెలో గురువారం స్కూటరిస్టులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతివేగం పనికిరాదన్నారు. మద్యం సేవించి వాహనం నడపరాదన్నారు. కార్యక్రమంలో మన్నూరు పోలీసులు, స్థానికులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

చిన్నమండెం : మండల వ్యాప్తంగా ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీఓ శేఖర్‌నాయక్ తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మే 10లోపు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. వివిధ యూనిట్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతి

పుల్లంపేట : మండలంలోని దళవాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఉపాధ్యాయుడు రమణ మాట్లాడుతూ రాధాకృష్ణన్ ఉపాధ్యాయ వృత్తిలో నుంచి అనేక మహోన్నత పదవులు అలంకరించి ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయితీతో పనిముట్లు

పెనగలూరు : మండలంలో 2024–25 సంవత్సరానికి సంబంధించి వ్యవసాయ పనిముట్ల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు సబ్సిడీతో గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి సుబ్రమణ్యం మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు కూలీల ఖర్చులు, శ్రమ, సమయం ఆదా చేసి వ్యవసాయాన్ని లాభసాటిగా చేసేందుకు ఈ పనిముట్లు అందించినట్లు తెలిపారు. వీటిని వినియోగించుకుని రైతులు, వ్యవసాయ అభివృద్ధి జరగాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతు భరోసా కేంద్రాల సిబ్బంది గంగాభవానీ, హర్షవర్ధన్ పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహం



మండల అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న ఎంపీడీఓ రాధాకృష్ణమరాజు

నందలూరు : మండలంలోని ఏపీఎండీసీ కార్యాలయంలో ఉద్యానశాఖ, జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా 2025–26 సంవత్సరానికి కొత్తగా పండ్ల తోటల పెంపకం కోసం అర్హులైన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరణపై రైతు సేవా కేంద్రం సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లకు ఎంపీడీఓ రాధాకృష్ణమరాజు ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మాట్లాడుతూ వ్యవసాయ, ఉద్యాన, పశువైద్య సహాయకులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, రైతు సేవా కేంద్రం పరిధిలో కొత్తగా మామిడి, జామ, నిమ్మ, దానిమ్మ, బత్తాయి, నేరుడు, ఉసిరి, డ్రాగన్ ఫ్రూట్, అంజూర, చింత, పనస, అవకాడో వంటి పండ్ల తోటల పెంపకానికి రాయితీ కోసం అర్హులైన రైతులను గుర్తించి వారి నుంచి దరఖాస్తులు స్వీకరించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాజంపేట ఉద్యాన శాఖాధికారి జి.సురేష్ బాబు, ఈఓఆర్‌డీ సునీల్ కుమార్, వ్యవసాయ, ఉద్యాన, పశువైద్య, క్షేత్రసహాయకులు, సువన్ ఆగ్రో ఇండస్ట్రీస్ మేనేజర్ కొండారెడ్డి పాల్గొన్నారు.

పెనగలూరు : పండ్ల తోటల పెంపకానికి రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ విజయారావు, హార్టికల్చర్ అధికారి సురేష్ బాబు కోరారు. ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఉపాధి సిబ్బంది, రైతు భరోసా కేంద్ర సిబ్బందికి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమా మహేశ్వర్, ఉద్యాన, క్షేత్ర సహాయకులు సుమన్, ఆగ్రో ఇండస్ట్రీస్ మేనేజర్ కొండారెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి మట్లి మహాభారతం

వీరబల్లి : మండలంలోని మట్లి పంచాయతీలో మట్లి తొగటపల్లి దగ్గర మాండవ్య నది ఒడ్డున వెలసిన శ్రీ కోదండరామస్వామి ఆలయం వద్ద శుక్రవారం నుంచి మహాభారత యజ్ఞం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మట్లి మహాభారతం అంటే జిల్లాలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతలు గలవు. ఈ నెల 18 నుంచి 30 వరకు ఈ మహాభారత యజ్ఞం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా పగలు భక్తులకు భోజనాలతోపాటు హరి కథా కాలక్షేపం ఉంటుందన్నారు. మహాభారతానికి సంబంధించి రాత్రిపూట నాటకాలు నిర్వహించడం జరుగుతుందని, గత పది రోజుల నుంచి పాండవులు, శ్రీకృష్ణుని విగ్రహాలను సంబంధించిన గ్రామాలలో ఊరేగింపు నిర్వహించినట్లు పేర్కొన్నారు.

కష్టజీవుల పాదయాత్రను విజయవంతం చేయండి

రైల్వేకోడూరు అర్బన్ : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు రోజుకు రూ.700 ఇచ్చి, 200 రోజులు పని దినాలు కల్పించాలని బండ్లపల్లి నుంచి అనంతపురం వరకు జరిగే కష్టజీవుల పాదయాత్రను విజయవంతం చేయాలని సర్పంచ్ శివయ్య తెలిపారు. స్థానిక కార్యాలయంలో గురువారం వ్యసాయ కార్మిక సంఘం నాయకులు కరపత్రాలు విడుదల చేశారు. 2006లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆధ్వర్యాన అనంతపురం జిల్లా బండ్లపల్లిలో ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. ఈ నెల 22, 23 తేదీల్లో తలపెట్టిన పాదయాత్రలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యసాయ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పందుగోలు మణి, జయరామయ్య తదితరులు పాల్గొన్నాను.

పిల్లలను పాఠశాలలో చేర్పించండి

లక్కిరెడ్డిపల్లి : అంగన్ వాడీ కేంద్రాలలో ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రీ స్కూల్ విద్యార్థులను ప్రాథమిక పాఠశాలలో చేర్పించాలని ఎంఈఓ చక్రే నాయక్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని అనంతపురం ఈడిగపల్లి దళితవాడ, వడ్డిపల్లి గ్రామాలలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్లు, ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడారు. ఐదేళ్లు పూర్తి చేసుకున్న విద్యార్థులను ప్రాథమిక పాఠశాలలో ఈ నెల 21వ తేదీలోపు చేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్బరాయుడు, మనోహర్, అంగన్ వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

మలాథియన్ మందు పిచికారి

మండలంలోని మద్దిరేవుల గ్రామం, ఈడిగపల్లి, మాలపల్లి, ఎగువ మాదిగపల్లిలలో గురువారం మలాథియన్ మందు పిచికారి చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సబ్ యూనిట్ అధికారి ఎన్.దేవదానం, సెక్రటరీ రజినీష్‌రెడ్డి, ఏఎన్‌ఎం విజయ్ కుమారి, ఆశా వర్కర్, అరుణ, వార్డు మెంబర్ అనసూయమ్మ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్



మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక శాఖ అధికారులు

రాయచోటి టౌన్ : అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా గురువారం రాయచోటి అగ్నిమాపక శాఖ అధికారులు నిర్వహించిన మాక్ డ్రిల్ చూపరులను ఆకట్టుకుంది. ఎక్కడైనా అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఎలాంటి చర్యలు తీసుకోవాలి, అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇచ్చిన తరువాత అధికారులు వచ్చి ఎలాంటి చర్యలు తీసుకొంటారనే అంశాలపై మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ మాక్ డ్రిల్ శ్రీ చైతన్య స్కూల్ భవన ఆవరణలో నిర్వహించారు. ఈ డ్రిల్ కార్యక్రమం రాయచోటి ఫైర్‌స్టేషన్ అధికారి వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో స్ట్రక్చరల్ టీం రెస్క్యూ టీం, ఫైర్ టీం, ఏ వాక్యూషన్ టీం, చర్చి టీం ఇలా అన్ని విభాగాల అధికారులతో కలిసి నిర్వహించారు.

తాగునీటి కోసం ఇక్కట్లు



తోపుడు బండ్ల ద్వారా తాగునీరు తెచ్చుకుంటున్న గ్రామస్తులు

సిద్దవటం : శాఖరాజుపల్లె గ్రామ పంచాయతీలో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పైపు పగిలిపోవడంతో గ్రామానికి నీరు సరఫరా కావడం లేదు. మూడు రోజులైనా అధికారులు మరమ్మతులు చేపట్టలేదు. దీంతో గ్రామస్తులు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పంట పొలాల్లోని వ్యవసాయ మోటార్ల వద్దకు వెళ్లి నీరు తెచ్చుకోవాల్సి వస్తోంది. తోపుడు బండ్లు పెట్టుకొని తెచ్చుకుంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి సమస్య తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మా సమస్య తీర్చండి

వీరబల్లి : మండలంలో సంఘం వాండ్లపల్లి పంచాయతీలోని బీసీ కాలనీ ప్రజలు తమకు మంచినీటి సమస్య ఉందని, దానిని తీర్చాలంటూ గురువారం గ్రామ పంచాయతీ సర్పంచ్ ఆంజనేయులను కోరారు.

పౌష్టికాహారం.. ఆరోగ్యానికి సహకారం

సిద్దవటం : పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యానికి ఎంతో సహకరిస్తుందని ఐసీడీఎస్ సీడీపీఓ శోభారాణి తెలిపారు. సిద్దవటంలోని బేల్దారి వీధిలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా 7వ పౌష్టికాహార పక్షోత్సవాలను ఘనంగా నిర్వహించారు. సిద్దవటం సెక్టారులోని అంగన్వాడీ వర్కర్లు పలు రకాల పౌష్టికాహార పదార్థాలను తయారు చేసి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ ఈ పక్షోత్సవాలు ఈ నెల 22వ తేదీ వరకు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శ్రీవిద్య, వరలక్ష్మి, అంగన్వాడీ వర్కర్‌లు ఉమాదేవి, సరోజని, గోపాలమ్మ, రామలక్ష్మి, సావిత్రి షమీనా, తిరుపతమ్మ, వరలక్ష్మి, పిల్లలు, వారి తల్లులు పాల్గొన్నారు.